క్లుప్తంగా

పంట పొలాల పరిశీలన



గన్నవరం రూరల్: మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను మండల వ్యవసాయాధికారి ఎస్ఎల్ తేజస్వి సోమవారం పరిశీలించారు. గ్రామంలో 900 ఎకరాల వరి పంట ముంపునకు గురైనట్లు ఆమె తెలిపారు. 1318 రకం విత్తనం వారం వరకూ ముంపు తట్టుకుంటుందని చెప్పారు. నీరు తరలిపోయే మార్గం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

చనుపల్లివారిగూడెంలో...

మండలంలోని చనుపల్లివారిగూడెంలో సోమవారం మండల ఉద్యానవన శాఖాధికారి ఇ.హరిచంద్ ఉద్యాన పంటలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పడిపోయిన మొక్కలు జాగ్రత్తగా నిలబెట్టి మట్టిని ఎగదోయాలని, ఆకులు, కొమ్మలు ఉంటే నీటిలో కరిగే మల్టీ–కె ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. హెచ్ఏ దీక్షా, ఏహెచ్ రవితేజ పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను వ్యవసాయ సంచాలకులు టి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వి.హరీష్ కుమార్, ఏఈవో దుర్గానాగేశ్వరరావు పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని గొడవర్రు, మద్దూరు గ్రామాల్లో ముంపునకు గురైన వరి, ఇతర వ్యవసాయ క్షేత్రాలను డీఆర్‌సీ డీడీఏ జ్యోతి రమణి, ఉయ్యూరు చెరకు పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి సందర్శించారు. వరద, వర్షాలతో ముంపు బారిన పడ్డ పొలాల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా పంటలను సంరక్షించుకోవచ్చని సూచించారు. ఏడీఏ శ్రీనివాసరావు, పామర్రు ఏడీఏ స్వర్ణలత, ఏఓ పిఎం కిరణ్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: మండలంలోని ఆరుగొలను, కానుమోలు, ఓగిరాల, రామన్నగూడెం గ్రామాల్లో ముంపునకు గురైన వరి పొలాలను సోమవారం బాపులపాడు మండల ఏఓ జొన్నలగడ్డ భవాని పరిశీలించారు. రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

వరద బాధితులకు ఆహారం పంపిణీ

పెనమలూరు: వరద బాధితులకు విజయవాడ రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల్లో పులిహోర, వెజిటబుల్ బిర్యాని, పెరుగు అన్నం ప్యాకెట్లు మంచినీరు పంపిణీ చేశారు. యనమలకుదురులో పునరావాస కేంద్రంలో ఉన్న నిర్వాసితులకు రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ధనేకుల మురళీమోహన్‌రావు భోజనం అందజేశారు.

చోరీ కేసుల్లో నలుగురు నిందితుల అరెస్ట్

గన్నవరం: పలు చోరీ కేసుల్లో నలుగురు నిందితులను గన్నవరం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు వివరించారు. ఇటీవల మండలంలోని ముస్తాబాద శివారులో దారి దోపిడి ఘటనపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన జక్కంపూడి కాలనీకి చెందిన పాలపర్తి వెంకన్న, నల్గొండ సురేష్, పసుపురెడ్డి దుర్గాప్రసాద్, కుమ్మరిపాలెంకు చెందిన నక్క గోపిరాజును సోమవారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి 90 గ్రాముల బంగారం, 10.500 గ్రాముల వెండి వస్తువులు, రెండు మొబైల్ ఫోన్స్, మోటర్ సైకిల్‌ను, నేరాలకు పాల్పడే వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ బీవీ శివప్రసాద్, సిబ్బందిని ఆయన అభినందించారు.



పెదపులిపాకలో వరదనీటిలో నివాసాలు



సావరగూడెంలో ముంపునకు గురైన పొలాలు



అంబాపురంలో ఇళ్లలోకి చేరిన వరద నీరు



రామవరప్పాడు ఫ్లైఓవర్ కింద ముంపునకు గురైన పొలాలు

గ్రామాలను ముంచెత్తిన వరద

- నిరాశ్రులైన వేలాది మంది జనాలు
- నదీ పరివాహక ప్రాంతాల్లో పూర్తిగా మునిగిన నివాసాలు
- తూతూ మంత్రంగా సహాయక చర్యలు

పెనమలూరు: కృష్ణవేణమ్మ ఉగ్రరూపం దాల్చింది. గ్రామాలపై ఒక్కసారిగా జలప్రళయం సృష్టించింది. మండల పరిధిలో కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో ఉన్న యనమలకుదురు, పెదపులిపాక గ్రామాల్లో భారీ ఆస్తి నష్టం జరిగింది. కరకట్ట నివాసితులు కట్టుబట్టలతో మిగిలారు. సాయం కోసం జనాలు ఆర్తనాదాలు పెడుతున్నా పట్టించుకునే వారు కనబడటం లేదు. కృష్ణానదికి వరద దాదాపు 12 లక్షల క్యూసెక్కులు రావడంతో జలప్రళయం ఏర్పడింది. కరకట్ట దిగువన నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న భవనాలు, ఇళ్లు పూర్తిగా మునిగిపోయాయి.

సహాయక చర్యలు ఏవి..?

కృష్ణానదికి భారీ వరద వస్తుందని తెలిసినా అధికారులు నిర్లక్ష్యం చూపారు. కరకట్ట దిగువన ఉన్న నివాసితులను అధికారులు సకాలంలో ఖాళీ చేయించలేకపోయారు. వరద నీరు ముంచెత్తడంతో చాలా మంది ఇళ్లల్లోనే చిక్కుకున్నారు. కొందరిని ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది సురక్షితంగా తరలించినా ఇంకా చాలా మంది భవనాల్లోనే బిక్కుబిక్కుమంటూ తిండీ తిప్పలు లేకుండా సాయం కోసం ఎదురుచూస్తున్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి రోడ్డున పడ్డ బాధితులకు ఆహారం, మంచినీటి ప్యాకెట్లు అందజేశారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందకపోవడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా చోడవరం, పెదపులిపాక ప్రాంతాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కంద, ఆకుకూరలు, చెరకు, వరి, పసుపు తదితర పంటలు సర్వనాశనం అయ్యాయి.

నేతల ఫీట్లు

వరద నీటిలో చిక్కుకున్న బాధితులకు న్యాయం చేయాల్సిన నేతలు పబ్లిసిటీ పిచ్చితో ఫీట్లు చేశారు. కెమెరామెన్‌లను వెంట తీసుకువచ్చి నానా హడావుడి చేశారు. నేతల చర్యలు చూసిన బాధితులు అసహనం వ్యక్తం చేశారు.

గన్నవరం రూరల్: మండలంలోని జక్కులనెక్కల, సావరగూడెం గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలో కూరుకుపోయాయి. బుడమేరు ప్రవహిస్తుండటంతో ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. మరోవైపు ఏలూరు కాలువ కట్టలు తెగిపోవడంతో గ్రామాల్లోకి నీరు వచ్చి చేరుతోంది. సావరగూడెం గ్రామానికి వెళ్లే కేసరపల్లి–సావరగూడెం రోడ్డు మార్గంలో చీమలవాగు పొంగి ప్రవహిస్తోంది. బొబ్బరవాగు ఉధృతంగా వెళుతోంది. పురుషోత్తపట్నం రైతులు తారు రోడ్డుకు గండికొట్టడంతో ఆ గ్రామానికి వెళ్లే వీలు లేకుండా పోయింది. మరోవైపు ముస్తాబాద రైల్వే ట్రాక్ సమీపంలో నీరు రోడ్డు పైకి రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రెండు గ్రామాల ప్రజలు జలదిగ్బంధంలో ఉండిపోయారు. జక్కులనెక్కలం జగనన్న కాలనీల్లో ఉన్న మూడు కుటుంబాలు తెల్లవారుజాము నుంచి సాయం కోసం చూడగా సావరగూడెం సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు, వీఆర్వో రవీంద్ర శివాజీ స్థానిక మత్స్యకారుల బోట్లు ఉపయోగించి గ్రామస్తుల సహకారంతో పునరావాస కేంద్రానికి తరలించారు. సావరగూడెంలో ఆదివారం రాత్రి చలికి మత్తి శ్రీనివాసరావు అనే భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో ఏలూరు కాలువకు పలుచోట్ల గండి పడటంతో పంట పొలాలు, విల్లాలు, ఇళ్లను ముంచెత్తింది. ట్రాక్టర్లు, జేసీబీ సాయంతో ముంపులో చిక్కుకున్న వారిని బయటకు తీసుకువచ్చారు. దావాజిగూడెం వద్ద ఏలూరు కాలువ పొంగిపొర్లుతుంది. వర్షం నీరు సమీపంలోని ఎయిర్‌పోర్ట్ రన్‌వే పరిసరాలను ముంచెత్తింది.

రామవరప్పాడు: ఎడతేరిపి లేకుండా కురిసిన వర్షాలకు రామవరప్పాడు, గుణదల, కండ్రిక, సింగ్‌నగర్, నున్న తదితర ప్రాంతాలు ముంపునకు గురైయ్యాయి. బుడమేరు పొంగడంతో వరద నీరు నివాసాలు, అపార్టుమెంట్లు, పంట పొలాలను ముంచెత్తింది. ఫలితంగా రామవరప్పాడు ఫ్లైఓవర్ దిగువ ప్రాంతం నుంచి మొదలు సింగ్‌నగర్ వరకూ వేలాది మంది నిరాశ్రయులయ్యారు. బాధితులను పడవలు, ట్రాక్టర్ల ద్వారా బయటకు తీసుకువస్తున్నారు. ఫ్లైఓవర్ దిగువన ముస్తాబాద్ వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా మునిగిపోయింది.

నున్న(విజయవాడరూరల్): నున్న జగనన్న కాలనీ వద్ద చప్టాకు అనుబంధంగా ఉన్న అప్రోచ్ రోడ్డుకు సోమవారం గండి పడింది. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ. రమణ జేసీబీతో రోడ్డు మరమ్మతులను నిర్వహించారు.

కంకిపాడు: మండలంలో ఏటిపాయ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏటిపాయ వద్దకు ప్రజలు వెళ్లకుండా తహసీల్దార్ కార్యాలయ, పోలీసు శాఖల అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మండలంలోని మద్దూరు, గొడవర్రు, రొయ్యూరు(తోట్లవల్లూరు) ప్రాంతాల గుండా ప్రవహించే ఏనుగుల కోడుకు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది.



ఉంగుటూరులో కొనసాగుతున్న బుడమేరు ఉధృతి

సర్వం కోల్పోయాం



వరదతో ఆస్తి కోల్పోయిన మమ్మల్ని ప్రభుత్వమే కాపాడాలి. ఎలా బ్రతకాలో తెలియడం లేదు. ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి. భవిష్యత్తులో ఇల్లు వరదకు మునగకుండా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పైనే ఆశలు పెట్టుకున్నాము.

–ఎల్.దిలీప్‌కుమార్, పెదపులిపాక

ఆయకట్టు మొత్తం మునిగిపోయింది



70ఎకరాలు వరి పొలం సాగు చేస్తున్నాను. ముస్తాబాద ఆయకట్టు మొత్తం మునిగిపోయింది. ఎకరానికి రూ. 15వేలు ఖర్చు పెట్టాను. ఎక్కడ చూసినా నీరే కనిపిస్తోంది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

–పాలడుగు రత్నారావు, ముస్తాబాద రైతు

రైతులను ఆదుకోవాలి

కంకిపాడు: భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి డిమాండ్ చేశారు. కంకిపాడు పట్టణంలో సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎగువ నుంచి వస్తున్న వరదలతో విజయవాడ, పెనమలూరు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయన్నారు. వరదల్లో చిక్కుకున్న ప్రజానీకాన్ని సురక్షితంగా తరలించి పునరావాసం కల్పించాలని పేర్కొన్నారు. వరి, ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకీ నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పలువురు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా నేత అన్నే సుబ్బారావు కోరారు. ఉయ్యూరు మండలంలోని కడవకొల్లు శివారు వీరవల్లి గ్రామంలో వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను సోమవారం రైతుసంఘం ప్రతినిధులు పరిశీలించారు. నాయకులు బి.రాజేష్, టీ.లక్ష్మణరావు, సుబ్రమణ్యం, నాగేశ్వరరావు, కీర్తి పాల్గొన్నారు.



రామవరప్పాడు హనుమాన్ నగర్‌లో..



మద్దూరు వద్ద నీట మునిగిన తమలపాకు తోట



గొడవర్రులో నీట మునిగిన వరి పొలాలు



వరద నీటిలో మునిగిన నున్న రహదారి



గొడవర్రు వద్ద కట్ట మీదుగా ప్రవహిస్తున్న ఏనుగుల కోడు



కేసరపల్లిలో ముంపు బాధితులను జేసీబీలో తీసుకువస్తున్న దృశ్యం



కాసరనేనివారిపాలెం వద్ద ప్రవహిస్తున్న ఏటిపాయ

ప్రజారోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలి

ఉయ్యూరు: అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకులు పినమాల నాగకుమార్ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందించారు. అధిక వర్షాలు, వరదల ప్రభావం నేపథ్యంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

గంజాయి విక్రేత అరెస్టు

కంకిపాడు: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని కంకిపాడు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎస్ఐ డి.సందీప్ కథనం మేరకు.. కంకిపాడు శివారు గాయత్రీ విహార్ నిర్జన ప్రదేశాల్లో ముందస్తు సమాచారంతో సోమవారం తనిఖీ చేపట్టారు. ఉప్పలూరు గ్రామానికి చెందిన మోర్ల తేజ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అతని వద్ద 1.400 కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగింది. నిందితుడిని అరెస్టు చేసి అతని బైక్, ఫోన్ సీజ్ చేశారు. గంజాయి అమ్మినా, కొన్నా, నిల్వ చేసినా కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

వీఆర్ఏ రమాదేవి మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు గ్రామ రెవిన్యూ అసిస్టెంట్ సుంకర రమాదేవి (32) అకస్మాత్తుగా మృతి చెందింది. కొద్దిరోజులుగా తలనొప్పి, వాంతులతో బాధపడుతున్న ఆమెను సోమవారం కుటుంబ సభ్యులు ఏలూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తీసుకువెళ్లారు. కానీ అప్పటికే ఆమె మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. తహసీల్దార్ వి.నాగభూషణం, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

మహానేతకు ఘన నివాళి



రాయ్‌నగర్‌లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు



కానూరులో మహానేతకు నివాళులర్పిస్తున్న దేవభక్తుని చక్రవర్తి, పార్టీ శ్రేణులు

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతిని నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ. గౌసాని, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాయ్‌నగర్‌లో జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి ఆధ్వర్యాన జరిగిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో మహానేత చిత్రపటానికి మహిళలు పుష్పాంజలి ఘటించారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో మహానేత వైఎస్సార్ వర్ధంతిని నిర్వహించారు. ప్రసాదంపాడులో ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గన్నవరం రూరల్: బీబీగూడెం గ్రామంలో నిర్వహించిన వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ విభాగం కార్యదర్శి సామల ఆంజనేయులు మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెనమలూరు: మహానేత వర్ధంతి సందర్భంగా పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి సోమవారం కానూరు సనత్‌నగర్‌లో మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజన్న మార్గంలోనే జగనన్న సంక్షేమ పాలన అందించారని పేర్కొన్నారు. నేతలు చాంద్‌బాషా, ఎండీ.అన్వర్, షేక్.రబ్బానీ, షేక్.కరీం, ఖాదర్, పఠాన్‌అమ్మద్, మణికంఠ పాల్గొన్నారు. కాగా పోరంకిలో మహానేత వర్ధంతి సందర్భంగా 600 మందికి అన్నదానం చేశారు.

విజయవాడ రూరల్: నున్న గ్రామం చెరువు సెంటర్ వద్ద గ్రామ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి జరిగింది. మహానేత విగ్రహానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూర్పు రామాలయం సెంటర్లో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహానేత వైఎస్సార్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. తొలుత పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి మహానేత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ బాకీ బాబు, సర్పంచ్ బాకీ రమణ, జేసీఎస్ మాజీ చైర్మన్ రాచూరి చిరంజీవి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని బస్టాండు సెంటరులో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు జంపాన కొండలరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి.

హనుమాన్‌జంక్షన్ రూరల్: మహానేత వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలను బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నిర్వహించారు. స్థానిక విజయవాడరోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పార్టీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు, పలువురు నాయకులు నివాళులర్పించారు. బాపులపాడు మండలం వేలేరు, కోడూరుపాడు, వీరవల్లిలో మహానేతకు వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు.

కంకిపాడు: గొల్లగూడెం గ్రామంలోని ప్రధాన కూడలిలో మహానేత వర్ధంతి సందర్భంగా అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు మహానేత వర్ధంతిని సోమవారం నిర్వహించారు. తేలప్రోలు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు తియ్యగూర వెంకట రామిరెడ్డి, గ్రామ కన్వీనర్ వింత శ్రీనివాసరెడ్డి(వాసు) వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.